

రేపు వికలాంగులకు ఉపకరణాల పంపిణీ



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ వికలాంగ దినోత్సవ వేడుకలను నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు వికలాంగ సంక్షేమశాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 20వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి వికలాంగుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వికలాంగులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కొత్త కార్డుల ప్రక్రియ షురూ

- చేరికలు, తొలగింపులకు అవకాశం
- పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం
- నేటి నుంచి అందుబాటులోకి సర్వర్
- సంక్రాంతికి రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు



ప్రజాశక్తి - ఆమదాలవలస

జిల్లాలో అర్హులైన వారికి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయనుంది. సంక్రాంతి కానుకగా వాటిని అందించనుంది. ఇందుకోసం ఈనెల రెండో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభిస్తోంది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించనుంది. దీంతోపాటు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. గత ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో జిల్లాలో ఎంతోమంది వాటి కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తగా వివాహమైన వారు, కార్డుల్లో తొలగింపులు, చేర్పులు చేయాల్సిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇటువంటి వారందరూ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల రెండో తేదీ నుంచి సర్వర్ అందుబాటులోకి రానుండగా, త్వరితగతిన దరఖాస్తులు పరిశీలించి అర్హులకు సంక్రాంతి కానుకగా రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేయనుంది.

గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ సక్రమంగా సాగలేదు. చివరకు కార్డుల్లో చేర్పులు, మార్పులకు కూడా అవకాశం కల్పించలేదు. ఎన్నికలకు ఆరు నెలలు ముందుగా ఈ ప్రక్రియను నిలిపివేసింది. దీంతో ఎంతోమంది రేషన్ అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగినులు వివాహాలై అత్తారింటికి వెళ్లిపోయినా రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నాయనే కారణంతో వారి తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలు అందించేవారు కాదు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేసిన వారి తల్లిదండ్రులు కూడా గతంలో పింఛను, ఇతర సంక్షేమ పథకాలకు అనర్హులను చేశారు. దీంతో వారు వాటికి నోచుకోక దూరమయ్యారు. అటువంటి వారందరికీ కొత్తగా అవకాశం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో, దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు సిద్ధమవుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి ఫొటోతో అందించిన రేషన్‌కార్డులూ మారనున్నాయి. కొత్త కార్డులపై పాలకుల ఫొటోలు లేకుండా రాజముద్రతో కొత్త కార్డులు అందించనున్నారు.

అప్రమత్తతతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అప్రమత్తంగా ఉండడం ద్వారా ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఆదివారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో ఎయిడ్స్ నియంత్రణకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన అవగాహనా సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ రక్త మార్పిడి సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్త పరీక్షలు చేసినప్పుడు వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్ఐవి పాజిటివ్‌గా గుర్తించిన వారు తప్పనిసరిగా చికిత్స తీసుకుంటూ మందులు తీసుకోవాలన్నారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ హెచ్ఐవి పాజిటివ్ ఉన్నంత మాత్రాన ఎయిడ్స్ ఉన్నట్లు కాదన్నారు. మూడు స్థాయిలు దాటిన తర్వాత ఎయిడ్స్ మారుతుందన్నారు. హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులు చికిత్స తీసుకుంటూ మందులు తీసుకోవాలన్నారు. అనంతరం హెచ్ఐవి పిల్లలు, వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కలెక్టర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, డిఎంహెచ్ మీనాక్షి, డిసిహెచ్ఎస్ కళ్యాణబాబుతో కలిసి వ్యాధిగ్రస్తులతో అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు, ఎన్‌సిసి కోఆర్డినేటర్ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి



వజ్రపుకొత్తూరు : తడిచిన ఓవును చూపిస్తున్న రైతు

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీలో)
ఎచ్చెర్ల	25.4
సంతబొమ్మాళి	6.8
లావేరు	13.5
రణస్థలం	15.0
ఆమదాలవలస	6.2
వజ్రపుకొత్తూరు	10.0
జలుమూరు	3.2
శ్రీకాకుళం	12.4
పోలాకి	6.6
నందిగాం	2.8
గార	3.6
టెక్కలి	6.2
కోటబొమ్మాళి	4.2
పాతపట్నం	1.8
మందస	2.4
మెళియాపుట్టి	1.0
పలాస	2.4
సారవకోట	5.2
కొత్తూరు	1.2
సరుబుజ్జిలి	3.4
కంచిలి	1.4
పొందూరు	4.2
ఎల్.ఎన్ పేట	2.0
నరసన్నపేట	2.8
సోంపేట	2.0
బూర్జ	2.0
హిరమండలం	1.2
జి.సిగడాం	6.4

'ముసురు'కుంది

- 'ఫెంగల్' ప్రభావంతో జిల్లాలో వర్షాలు
- 155.2 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా ఎచ్చెర్లలో 25.4 మి.మీ వర్షం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, లావేరు, పోలాకి, వజ్రపుకొత్తూరు

ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఆదివారం మోస్తరు వర్షాలు కురిశాయి. చిరుజల్లులతో ముసురు అలుముకుంది. జిల్లావ్యాప్తంగా 155.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, గరిష్ఠంగా ఎచ్చెర్ల మండలంలో 25.4 మి.మీ వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. మరోవైపు పంట చేతికొచ్చే సమయం కావడంతో వర్షాల వల్ల నష్టం చేకూరుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలకు వరి పనలు నీటమునిగాయి. నూర్పులు చేపట్టి కళ్లాల్లో దాచిన ధాన్యం కూడా తడిచిముద్దయిన పరిస్థితులు నెలకొన్నాయి. లావేరు మండలంలో ఇప్పటికే పండిన వరి పంటను కొంతమంది రైతులు పొలాల్లోనే కుప్పలు పెట్టగా, మరికొందరు కోసిన పంట కుప్పలు పెట్టడానికి వీలుకాకపోవడంతో వర్షాలకు ఓవులు తడిసిపోయాయి. పోలాకి మండలంలోని ప్రియాగ్రహారం, పోలాకి, బెలమర, గాతలవలస, మబగాం, ఈదులవలస తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం కోత కోసి ఉన్నాయి. కోయని వరి పంటలు కూడా గాలికి నేలకొరిగాయి. వజ్రపుకొత్తూరు మండలంలో కోసిన పంట పొలాల్లో తడిచిపోయిన పరిస్థితి నెలకొంది. బెండిగేటు వద్ద ఇటుక బట్టి కార్మికులు తాము తయారు చేసిన పచ్చి ఇటుకలను పరదాలతో కప్పే పనిలో నిమగ్నమయ్యారు. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే కుప్పలు పెట్టిన వాటికి కొన్నిచోట్ల పరదాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేసినా, కుప్పల కిందకు నీరు వెళ్లడంతో తడిచిపోయాయి. పెట్టుబడులు పెట్టిన పంట చేతికి వచ్చే సమయంలో తుపానుతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.



లావేరు : కేశవరాయపురంలో నేలకొరిగిన వరిచేను

విద్యుత్ ఛార్జీల పెంపుతోనే...

బాబు నైజం బట్టబయలు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అధికారంలోకొచ్చిన ఐదు నెలల్లోనే రూ.15,400 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఛార్జీల పెంపుతో బాబు నైజం మరోసారి బయటపడిందన్నారు. పెద్దపాడులోని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు విద్యుత్ భారాలను ప్రజలపై రుద్దారని దుయ్యబట్టారు. రెండు దఫాలుగా కలిపి ఒక్కో యూనిట్ పై అదనంగా రూ.2.19 పెరిగిందన్నారు. 2014-19 మధ్య టిడిపి హయాంలో విద్యుత్ రుణ భారం 23.88 శాతం పెరగ్గా, 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వ హయాంలో 7.28 శాతానికి తగ్గిందని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల మొదలు అన్నిరకాల ధరలు పెంచుకుపోయిన చంద్రబాబు ప్రభుత్వం, ఇప్పుడు విద్యుత్ ఛార్జీలనూ భారీగా పెంచడం దారుణమన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకొచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. కూటమి నాయకుల మోసపూరిత ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఓట్లేశారని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైసిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. తనపైనా కేసు పెడతారన్న ప్రచారం సాగుతోందని, ఏ కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పార్టీకి దూరంగా ఉన్నారన్న ప్రచారం నిజం కాదన్నారు. కొంతకాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు తప్ప వైదొలగలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

పంచ వైష్ణవ క్షేత్రదర్శినికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని వైష్ణవ ఆలయాల సందర్శనకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోందని జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలకు 13 ప్రత్యేక బస్సులు నడిపామని, అదే తరహాలో ఈనెలలో పంచవైష్ణవ క్షేత్రాలకు బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7, 14, 21, 28 తేదీల్లో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రాత్రి ఎనిమిది గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అంతర్వేదిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, గొల్లల మామిడాడ కోదండ రామాలయం, అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయాలను సందర్శించడానికి సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. ఒకరికి ఛార్జీ రూ.2,150 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. టిక్కెట్లు ఆన్‌లైన్ www.apsrtconline.inలో గానీ శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గానీ పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25608, 99592 25609, 99592 25610, 99592 25611 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, విడతల వారీగా అందరి సమస్యలు పరిష్కరిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బారు నిర్వహించారు. నియోజకవర్గంలో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని, త్వరలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించిన విషయాలు అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే విడతల వారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి నాయకులు రాంకుమార్, తంగుడు సునీల్ పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లిలో అలరించిన సంగీత నీరాజనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో కృష్ణవేణి కర్నాటక శాస్త్రీయ సంగీత నీరాజనం కార్యక్రమం అలరించింది. ప్రఖ్యాత కళాకారులు విదుషి. మండ సుధారాణి బృందం గాత్ర కచేరి (కర్ణాటక శాస్త్రీయ సంగీతం), వయోలిన్-డాక్టర్ మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగం ఎం.శ్రీధర్, ఘటం-మావుడూరు సూర్యప్రసాదరావు తదితరులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. వాతాపి గణపతిం.. ఎందరో మహానుభావులు.. వంటి కీర్తనలు ఆహూతులను అలరించాయి. కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి సంయుక్తంగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ఈ సంగీత కార్యక్రమం ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రతినిధి చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, అరసవల్లి ఆలయ ఇఒ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.




గాత్ర కచేరీ నిర్వహిస్తున్న సుధారాణి బృందం

ముమ్మరంగా 'అభయ' కార్డుల సర్వే

- కేన్సర్‌పై ఇంటింటా సర్వే
- పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి
- డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి





ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి గ్రామాల్లో అభయ కార్డుల జారీ, కేన్సర్‌పై సర్వే ముమ్మరంగా సాగుతోందని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రజలు ఈ సర్వేలో తమ వివరాలను స్వచ్ఛందంగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు అదుపులో ఉన్నాయన్నారు. శీతాకాలం వ్యాధులు విజృంభించకుండా ఉండేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైతే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. మైదాన, తీర ప్రాంత గ్రామాల ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కేన్సర్‌పై సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

అభయ, కేన్సర్‌పై సర్వేలు ఎలా సాగుతున్నాయి?

జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన అభయ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టాం. వైద్య సిబ్బంది అభయ యాప్‌లో ప్రతి ఒక్కరి వివరాలూ నమోదు చేస్తున్నారు. ఈ కార్డు జారీ వల్ల లబ్ధిదారులకు ఐడి ఉంటుంది. అందులో అతని ఆరోగ్య స్థితిపై పూర్తి వివరాలు నమోదు చేస్తారు. అలాగే కేన్సర్‌పై సర్వే యాప్‌లో నమోదైన తర్వాత వారికి స్క్రీనింగ్ పరీక్షల అనంతరం వారి వివరాలు నమోదు చేసుకోవచ్చు. కేన్సర్ వ్యాధి సోకిన రోగుల్లో ఎక్కువ మంది అడ్వాన్స్ స్టేజ్ వరకు గుర్తించకపోవడం వల్లే ప్రాణాంతకంగా మారుతున్నాయి. అందువల్ల వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. ఎవరైన తమ వివరాలు తెలియజేయకపోతే వారికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రజలు పూర్తి సహకారం అందించాలి.

సీజనల్ వ్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో ఈ ఏడాది సీజనల్ వ్యాధులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది డెంగీ, మలేరియా కేసుల నమోదు సంఖ్య పెరిగింది. అధిక వర్షాలు, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం తదితర కారణాల వల్ల దోమలు పెద్దఎత్తున పెరిగాయి. దోమల నియంత్రణా చర్యలు చేపట్టేందుకు వీలుగా గ్రామాల్లో సైతం ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ ప్రస్తుతం ఎఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు, ఎంఎల్‌హెచ్‌పిలు అందుబాటులో ఉన్నారు. సచివాలయాల పరిధిలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాం. నిర్లక్ష్యం కారణంగా మురుగునీరు, వర్షపునీరు ఎక్కడికక్కడ నిల్వ చేస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి?

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. దీనివల్ల తేమ శాతం గాలిలో అధికంగా ఉంటుంది. మంచు కురిసే సీజన్ కావడం వల్ల ఎక్కువ మందిలో జులుబు, దగ్గు, కోరింతదగ్గువంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీంతో ఊపిరి పీల్చుకోవడం ఈ రోగుల్లో పెద్ద సమస్యగా తయారవుతుంది. అందువల్ల శీతల సమయాల్లో వేడి నీరు కాచి వడగట్టి తాగాలి. లేకుండా శ్వాసనాళాల్లో కఫం చేరి ఊపిరి తీసుకోవడం కష్టసాధ్యమవుతుంది. రాత్రి వేళల్లో ఈ సమస్య అధికంగా ఉంటే గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

మాతాశిశు మరణాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం కిల్కారి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా, నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమి సేవలపై అవగాహన కల్పించాం. కిల్కారి సేవల్లో వాయిస్ కాల్స్ సేవలతో మాతా శిశుఆరోగ్యానికి భద్రత, గర్భిణులు, బాలింతలు శిశువుల ఆరోగ్యం పరిరక్షించుకునేందుకు దోహదపడుతుంది. మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలి.

కిల్కారీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా?

కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వస్తున్నాయి. గర్భం దాల్చిన నాటి నుంచి ఎఎన్‌ఎం వద్ద గర్భస్థ వివరాలను నమోదు చేయించుకొనేటప్పుడు ఇచ్చిన మొబైల్ నంబరుకు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయి. ఈ సందేశాలను మహిళ గర్భం దాల్చిన నాలుగు నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చేవరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు డాక్టర్ అనిత కల్పిత వైద్యురాలి వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. కాల్ సమయం సుమారు 1 నిమిషం 30 సెకండ్లు ఉంటుంది. ప్రతి గర్భిణీ పూర్తిగా వినడానికి ప్రయత్నించాలి. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదైన గర్భిణికి 01244451660 నంబరు నుంచి వాయిస్ కాల్ వస్తుంది. ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవిఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకేరోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుంది. ఆ సందేశాలను మళ్లీ వినాలనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేయవచ్చు.



స్టే ఆర్డర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

హుదూద్ ఇళ్లు అమ్ముకునే యత్నం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంతబొమ్మాళి మండలం మేఘవరంలో హుదూద్ ఇళ్లు రద్దు చేసి అమ్ముకోవడానికి మంత్రి అచ్చెన్నాయుడు ప్రయత్నించారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సందర్భంగా మండలంలోని అక్కివరంలో తన స్వగ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లు రద్దు చేసి టిడిపి నాయకులకు అమ్ముకోవడానికి ప్రయత్నం చేశారని విమర్శించారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి హైకోర్టు నుంచి స్టే ఆర్డర్‌ను తీసుకొచ్చానని అన్నారు. ఈ ఆర్డర్‌ను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ఎంపిపి ప్రతినిధి నేరంగి అప్పారావు, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరావు, శ్రీరాములు, వైసిపి నాయకులు మాధురి పాల్గొన్నారు.



తెరవే సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 99వ నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ సభ్యులు, ఇటీవల స్వర్గస్తులైన రచయిత్రి అయ్యగారి సుమిత్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కవుల రచనలు చిరస్థాయిగా నిలిచి పోయేలా గ్రంథస్తం చేయాలని కోరారు. రాబోవు 100వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం కార్యక్రమంలో తెరవే కవుల రచనలతో వెలువడు కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. ముఖ్య అతిది జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ సాహితీ సంస్థ నిర్విఘ్నంగా శతమాస కవిసమ్మేళనం నిర్వహించటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డా.కోమల రావు (పాపం పోస్ట్‌మాన్), ఇద్ది పాపయ్య (ప్రజా విజయం), నిక్కు హరి సత్యన్నారాయణ (మందులోయ్ మందులు), ఐ.యన్. డి.ప్రసాద్ (అక్షరమే నాగురువు), కిల్లాన శ్రీనివాస్ (తమాషా), యు.నాగేశ్వరరావు (నాగదేవత), వి.రాజారావు (ఉగ్ర వాహిణులు), ముట్నూరు ఉపేంద్ర శర్మ (వెలుగు రేఖ), భోగెల ఉమా మహేశ్వరరావు (వెలుగు జాడ గురజాడ), ఆర్.వి. రమణమూర్తి (అభ్యుదయ కవి గురజాడ), పూడి జనార్దన్ (సాహితీ ప్రసంగం), జె.శరత్‌బాబు (ప్రపంచ తెలుగు మహాసభలు), కుప్పిలి త్రినాథరావు (రైతన్న), చోడవరం ఈశ్వరరావు (వామ్మో డ్రైవింగ్), బాలాజీ రవికిరణ్ (కొడుకా! కొడుకా!), కవితలను వినిపించారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ



పోలాకి : ఎయిడ్స్ అక్షర ఆకృతిలో కూర్చున్న విద్యార్థినులు

పొందూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీని చేపట్టి మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సుజాత, ఐసిటిసి కౌన్సిలర్ కె.నాగలక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఆస్పత్రి టిబిఎస్‌ఐజి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రెడ్‌రిబ్బన్ ఆకారం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎఎన్ఎం యోగీశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత పాల్గొన్నారు. అలాగే లోలుగు ఉపహార్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపహార్ సిబ్బంది లోపింటి అప్పారావు, శ్రీనివాసరావు, సింహాచలం పాల్గొన్నారు.

లావేరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌ను నిరోధించండి, నిశ్శబ్దాన్ని ఛేదించండి. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు నివారణ ఒక్కటే, ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదు. అంటించుకునే వ్యాధి అంటూ స్థానిక పాఠశాల నుంచి గ్రంథాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో బి.దివాకర్‌కు ప్రథమస్థానం దక్కించుకోగా గ్రంథాలయం తరుపున బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధి అని, సక్రమమైన జీవనాన్ని సాగిస్తే ఎయిడ్స్ రాదని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా న్యాయ సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధక్షులు లఖినేని శ్రీనివాస్, న్యాయవాదులు బి.నారాయణరావు, యు.తిరుమలరావు, ఎస్.తిరుపతి, పూజారి వాసుదేవరావు, కె.మన్మథరావు, వై.వెంకటరావు, పల్లి వాసుదేవరావు, సిహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.

పలాస : స్థానిక ప్రభుత్వాసత్రి వద్ద ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిటిసి మెడికల్ కౌన్సిలర్ బగాతి శ్రీకాంత్, సిబ్బంది, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పాతపట్నం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పాతపట్నంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వాదిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వేణుగోపాల్, అనిత, సునీత, షణ్ముఖరావు, సందీప్ బరోడా, హెడ్ నర్స్ భారతి, ఐసిటిసి కౌన్సిలర్ జి.బాబూరావు, ఎల్‌టిలు పావని, గోవింద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విస్తరణాధికారి డాక్టర్ ఎన్.రవికుమార్ గంగివలసలోని కెజిబివి పాఠశాలలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రెడ్ రిబ్బన్ ఆకృతి, హెచ్‌ఐవి వైరస్ ఆకృతిలో విద్యార్థులను కూర్చోబెట్టి ఎఆర్‌టి థెరపీ ద్వారా రోగిలో కలిగే మార్పులను ప్రత్యక్షంగా అర్థమయ్యేటట్లు వివరించారు.



పొందూరు : రెడ్ రిబ్బన్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థినులు

కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ శారద, పిహెచ్‌సి సూపర్‌వైజర్ మంగం శేఖర్‌బాబు, విజయ, పూర్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి : ఎయిడ్స్ నివారణకు అవగాహన అవసరమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎ.శివరామకృష్ణ, ఎల్.నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

రెండేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో ప్రతిఒక్కరు కీలకపాత్ర వహించాలన్నారు. విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఎఇ లక్ష్మీనారాయణను ప్రశ్నించారు. గతంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలపై ఆరా తీశారు. దీనిపై ఎఇ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మాట్లాడుతూ మండలంలో వెయ్యికిపైగా ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలు ఉన్నాయని, వాటిని మార్చి 31లోగా పూర్తిచేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించామని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఎవరైనా కొత్తగా గృహ నిర్మాణాలు చేపట్టినట్లయితే వారికి కూడా ప్రభుత్వం తరపున రూ.2 లక్షల 50 వేలు అందించడం జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రతిఒక్కరికి సొంత ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి సొంతిల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారి కూడా పూర్తిగా పాడైపోయాయని జనవరిలోగా వాటికి మరమ్మతులు జరిపి ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బి అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిపి కర్నెన దీప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ నాయుడు, జెడ్‌పిటిసి బి.రామారావు, వైస్ ఎంపిపి సూర్యారావు, కె.కృష్ణంనాయుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కె.గోవిందరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఈశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. కూటమి ప్రభుత్వం తనను గుర్తించి రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. పూండి, బెండి గేట్ రోడ్డును అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. అదే విధంగా ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాసలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దున్న షణ్ముఖరావు, కర్ని రమణ, నారాయణస్వామి, పాపారావు, సత్యం పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరరావు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు



మండలంలోని బొంతుపేట సమీపంలోని కూడలి వద్ద గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడడంతో పోలీసులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబరు 30 రాత్రి మృతి చెందినట్లు ఎఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు 50 ఏళ్లు ఉంటాయని, ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు 6309990851 నెంబర్‌కు ఫోన్ చేసి లావేరు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ లక్ష్మణరావు కోరారు.

జూదరుల అరెస్టు

రూ.33,480 స్వాధీనం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పిసిని పంచాయతీ సమీప తోటలో పేకాట జరుగుతుందన్న సమాచారం మేరకు జె.ఆర్.పురం ఎస్‌ఐ చిరంజీవి తమ సిబ్బందితో దాడి చేసి ఆదివారం పట్టుకున్నారు. ఈ దాడిలో భాగంగా ఐదు ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లు, 15 మంది జూదరులను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సత్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఐఎంసి రమణకు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో ఆర్మీ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్న బి.వి.రమణను ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సత్కరించారు. ఎయిడ్స్ డే సందర్భంగా అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మెమొంటో ఇచ్చి సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పొత్రకండలో ఆదివారం ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. తొలుత సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిఎసిఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో పది క్లస్టర్లు ఏర్పాటు చేశామని, వాటి ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు నిర్వహించామని తెలిపారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇచ్చిన 48 గంటల్లో రైతులకు ఖాతాలకు డబ్బులు జమ చేస్తామన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులు నిర్వహించిన ఆదర్శ క్షేత్రాన్ని



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ అశోక్

పరిశీలించి అధికారులను అభినందించారు. కార్యక్రమంలో సురాడ చంద్రమోహన్, జి.కె.నాయుడు, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, పౌరసరఫరాల డిటి కూర్మారావు, డిటి ఉమామహేశ్వరరావు, ఎడిఎ కె.జగన్మోహనరావు, ఎఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.



పలాస : అవార్డు అందుకుంటున్న సిఐ మోహనరావు

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- పలాస

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధికి చెందిన సిబ్బందికి ఉత్తమ అవార్డు గుర్తింపు లభించింది. దోపిడీ, దొంగతనాల కేసుల్లో దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన కాశీబుగ్గ సిఐ దాడి మోహనరావు, కానిస్టేబుళ్లు ఈశ్వర్, ఉషాకిరణ్, ప్రదీప్, కామేష్, కిరణ్, నీలకంఠాలకు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ప్రశంసాపత్రాలను అందజేశారు.

పోలాకి: ఏ ఉద్యోగికైనా విధి నిర్వహణలో కష్టపడి, నిజాయితీగా సేవలు అందిస్తే వారికి గుర్తింపు ఉంటుందని ఎస్‌ఐ జి.రంజిత్ అన్నారు. తమ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు శంకర్, అప్పన్నలకు ఎస్‌పి ప్రశంసాపత్రాలు, నగదు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల మండలంలోని వనవిష్ణుపురంలో జరిగిన ఘర్షణలు అదుపు చేయడం వారు చేసిన కృషికి ఈ ప్రసాంసపత్రాలు అందజేశారని తెలిపారు.

పాతపట్నం : గత నెల 13న 563 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో పాతపట్నం సిఐ వి.రామారావు, మెలియాపుట్టి ఎస్‌ఐ పి.రమేష్‌బాబు చాకచక్యగా వ్యవహరించి పట్టుకున్నారు. విధి నిర్వహణలో చేసిన సేవలకు ఎస్‌పి ప్రశంసాపత్రాలు, నగదును అందజేశారు. పోలీస్ సిబ్బంది ప్రజలతో మమేకమై, కేసులు దర్యాప్తులో వేగవంతంగా వ్యవహరించాలని ఎస్‌పి సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత నెల నవంబరులో ముమ్మరంగా దాడులు చేపట్టి 21 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వారి వద్ద నుంచి 134 ఆంధ్రా మద్యం సీసాలు, 97 ఒడిశా మద్యం సీసాలు స్వాధీనం చేసుకు న్నామని, మూడు బైక్‌ను సీజ్ చేశామని అన్నారు. నిందితులను మండల మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు ఎస్‌ఐ సిహెచ్.వి.రమణారావు ఉన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

నరసన్నపేట : నరసన్నపేట ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జాగిలాల సహాయంతో బస్సుల్లోను, కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. నరసన్నపేట పరిధిలో ఎక్కడా ఎటువంటి గంజాయి అమ్మకాలు రవాణా



నరసన్నపేట : తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జరిగిన తమ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ దుర్గాప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పోలాకి: గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామని సిఐ శ్రీనివాసరావు అన్నారు. పోలాకి కేంద్రంలో మార్కెట్ షాపులు, వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.రంజిత్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కవిటి

మండల పరిషత్ తీర్మానం లేకుండానే గోకులం షెడ్లు ఎలా మంజూరు చేశారని, కేవలం పంచాయతీ తీర్మానంతో పనులు నిర్వహిస్తే మండల పరిషత్ ఎందుకని ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎంపిటిసిలు డి.సతీష్, పి.కృష్ణారావు, ఉప సర్పంచ్ దేవరాజు సాహు ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఇన్‌ఛార్జి పశు వైద్యాధికారి కిరణ్ మాట్లాడుతూ పశు వైద్యశాఖ, ఉపాధి హామీ కింద మండలంలో గోకులం షెడ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. దీనిపై సభ్యులు స్పందిస్తూ గోకులం షెడ్లు ఏకపక్షంగా మంజూరు చేశారని, అసలు మండల పరిషత్ తీర్మానం లేకుండా ఏ విధంగా షెడ్లు మంజూరు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు ఎపిఒ మోహనరావు సమావేశానికి గైర్హాజరు కావడంతో ఇసి మెంబర్ నీలంబర్ మాట్లాడారు. గోకులం షెడ్లు

గోకులం షెడ్ల నిర్మాణాలపై వాడివేడి చర్చ



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపిపి పద్మ

మంజూరుకు మండల పరిషత్ తీర్మానం అవసరమమే కానీ, పంచాయతీ తీర్మానంతో షెడ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. దీనిపై ప్రకాష్ స్పందిస్తూ కనీస సమాచారం లేకుండా పనులు చేయడం సరికాదని, దీనిపై సరైన సమాచారం ఇవ్వకపోతే న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. మండల పరిషత్ అనుమతి లేకుండా మంజూరు చేసిన గోకులం షెడ్లు నిలిపివేయాలన్నారు. బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి, వైస్ ఎంపిపి గోపయ్య మాట్లాడుతూ తమ పంచాయతీలో అర్థాంతరంగా నిలిపివేసిన పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. మండలంలో జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రజల సౌకర్యార్థం తక్షణమే జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. వ్యవసాయశాఖ అధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఇంకా వరి కోతలు ప్రారంభం కాలేదని, అయినా మండలంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉద్యానవనశాఖ అధికారి మాధవీలత మాట్లాడుతూ బిందు, సూక్ష్మ సేద్యంపై అందిస్తున్న రాయితీలు, పథకాలు వివరించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అధికారులు కనీస సమాచారం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఏ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పానుగ్రాహి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరావు

కళలను కాపాడుకుందాం

ఆమదాలవలస : కళలను కాపాడుకుందామని, అలాగే వాటిని రక్షించుకుందామని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు టేకి త్రినాథరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని గేదెలవానిపేట వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలు జనాన్ని జాగృతం చేస్తాయన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి బాగాది వెంకటరావు మాట్లాడుతూ సంఘంలోని కళాకారులందరూ సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. సంఘం అభివృద్ధికి కళాకారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారుల సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, పేడాడ ధనంజయరావు, దాస్యం లక్ష్మణరావు, కాగితాపల్లి సంజీవరావు, సంఘ గౌరవాధ్యక్షులు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి శర్మ, కోశాధికారి కొంచాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న రామారావు, సాయిరాజ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నిలకు ముందు ఛార్జీలు పెంచనని హామీనిచ్చారని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కేసిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ విమర్శించారు. స్థానిక సేచ్ఛావతి ఆలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచేశారని అన్నారు. ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్

దగా ప్రభుత్వం

అంబాసిడర్ విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్కు నయ వంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ.. మరోసారి ప్రజల నడ్డి విరిచారన్నారు. డిసెంబర్ వినియోగం నుంచే ఛార్జీలు వసూలు చేస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల దివ్య భారతి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు నర్తు నరేంద్ర, టౌన్ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమదాలవలస : విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు హామీఇచ్చిన చంద్రబాబు



ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ఇది ప్రజలను దగా చేయడమేనని నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బొడ్డేపల్లి పేట జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, బొడ్డేపల్లి పేట వార్డు ఇన్‌ఛార్జి మామిడి రమేష్ కుమార్, అన్నెపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనీస ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపాలిటీలో పౌరులకు అందజేస్తున్న సేవల్లో కనీస ప్రమాణాలు పాటించక పోవడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం నగరంలోని రైతుబజార్ సమీపంలో విశ్రాంతి ఉద్యోగుల సమావేశ మందిరంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. నగరంలో సేకరిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమం చేపట్టకపోవడం వల్ల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త వేరు చేయకుండా తండ్యాంవలస డంపింగ్ యార్డులో పారబోస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. మరోవైపు ప్రజలకు నిత్యం సరఫరా చేస్తున్న మంచినీటి సరఫరాలో క్లోరినేషన్‌లో పిహెచ్ ప్రమాణాలు, పరీక్షలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చేపట్టడం లేదన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రజల సమస్యలను నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. డాక్టర్ సుబ్బారావు, వంగా మహేష్, అర్జునరావు, చౌదరి లక్ష్మణరావు, ఉంగటి వెంకటరమణ, ప్రసన్న కుమార్, సుమతి మోహన్, బి.వి.రమణమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

కంచిలి : అమరావతిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన గత నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కంచిలి గురుకుల కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ఆదివారం కళాశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ బి.అప్పారావు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కళాశాలకు చెందిన వాలీబాల్ టీం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే వంద మీటర్ల పరుగు పందెంలో పాఠశాలకు చెందిన బైపిసి విద్యార్థి ఆర్.యాదగిరి కాంస్య పతకాన్ని, లాంగ్ జంప్ విభాగంలో ఎస్.చరణ్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. వీరికి ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



ట్రోఫీని అందజేస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ పావని

ఉత్తమ వైద్యాధికారిగా పావని

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఐ.పావని ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆమెకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, విధి నిర్వహణలో భాగంగా అవార్డును అందుకున్నట్లు డాక్టర్ పావని తెలిపారు. ఈమెకు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలియజేశారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి- పాతపట్నం

ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయులు సమావేశం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ సమావేశం ఖర్చులకు ఆదివారం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిర్వహించనున్న ఈ సమావేశం పండగ వాతావరణంలో చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విద్యావ్యవస్థలోనే నూతన సువర్ణాధ్యాయమని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం సనపల వైకుంఠరావు, ఎస్ఐ బి.లావణ్య, జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది సవరయ్య, కణితి లక్ష్మీనారాయణ, మన్మథస్వామి, సన్యాసిస్వామి పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం సింగుపురానికి చెందిన ఆవల వెంకయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆయన వైద్యచికిత్సల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో సిఎం సహాయనిధికి సిఫార్స్ చేశారు. సిఎం చంద్రబాబు స్పందించి రూ.1.60 లక్షల ఆర్థికసాయాన్ని విడుదల చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో వెంకయ్య కుటుంబసభ్యులకు చెక్కును ఎమ్మెల్యే శంకర్ అందజేశారు. కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరక్టర్ చౌదరి నారాయణమూర్తి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న భానుమూర్తి

తిరుమలరావుకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- కొత్తూరు

1986లో భీమునిపట్నం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో బాల్యమిత్రులు శిక్షణ పొందారు. అనంతరం వేర్వేరు జిల్లాల్లో స్థిరపడ్డారు. ఆ చిననాటి స్నేహితులిద్దరూ ఆదివారం కలుసుకుని గతాన్ని నెమరు వేసుకున్నారు. మండలంలో కడుం పాతపొన్నుటూరు పాఠశాలలో సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా పనిచేస్తున్న కుదమ తిరుమలరావుకు భీమునిపట్నం కళాసాహితి ఆధ్వర్యాన నిర్వహించిన కవుల, కథకుల సమావేశానికి ఆహ్వానం అందింది. తిరుమలరావు భీమునిపట్నం వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితుడు పడెం భానుమూర్తి వేదిక వద్దకు వచ్చి ఆనాటి తోటి శిక్షణార్థిని ఘనంగా సన్మానించారు. భానుమూర్తి ప్రస్తుతం విజయనగరం జిల్లా భోగాపురం మండలం బసవపాలెం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తిరుమలరావు జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతులమీదుగా పొందారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షునిగా కూర్మాచారి

నందిగాం: మండల విశ్వబ్రహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా ఎం.కూర్మాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా విశాకోటి నీలాచలం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సూర్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఆర్.మోహనరావు, బి.శంకరరావు, కోశాధికారిగా బి.విశ్వనాథం, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రమశిక్షణ కలిగిన విద్యనభ్యసించడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అరసవల్లిలోని పిఆర్‌టియు భవనంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్‌పి, ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఉన్నత విద్యనభ్యసించడం ద్వారా సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ విద్య పూర్తయ్యే వరకు ప్రతి ఏడాది ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి చొప్పున ఐదేళ్ల పాటు రూ.60 వేల ఉపకార వేతనం అందిజేస్తుందన్నారు. ఈ మోడల్ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యితో పాటు జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్


ఆమదాలవలస : విద్యార్థికి షీల్డ్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒ ఎ.మాధవరావు, పిఆర్‌టియు నాయకులు కె.సత్య న్నారాయణ, వసంత రాజారావు, జి.యోగానంద్, వి.హరిశ్చంద్రుడు, రాజశేఖర్, కె.కిరణ్ కుమార్, సుదర్శనరావు, కిషోర్ కుమార్, నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోంపేట: పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్ఎంఎస్ మోడల్ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో విజేతలుగా ఎర్ర ముక్కాంకు చెందిన జె.తిరుమల ప్రథమ స్థానంలోనూ, డి.జి.పురానికి చెందిన ఉమా మాధురి ద్వితీయ స్థానంలో, బోరివంకకు చెందిన చందు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి నిర్వాహకులు ప్రోత్సాకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్. శివరాం ప్రసాద్, చిట్టిబాబు, సంఘ ప్రతినిధులు దాలి బందు, శరత్‌బాబు, రమేష్, మాధవరావు, తారక్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి విద్యార్థులకు పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ మోడల్ పరీక్షకు బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస, రూరల్, అర్బన్, పొందూరు, ఎల్ఎన్ పేట మండలాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలకు 502 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఈ పరీక్షను పిఆర్‌టియు ఆమదాలవలస ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి ఆమదాలవలస గేట్ స్కూల్‌కు చెందిన టి.అఖిలకు రూ.3 వేలు, ద్వితీయ బహుమతి లక్ష్మీ నగర్ హైస్కూల్‌కు చెందిన పి.నవీన్‌కు రూ.2 వేలు, తృతీయ బహుమతి లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.చరిష్మాకు రూ.వెయ్యి నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను బహుకరించారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాల హెచఎం బొడ్డేపల్లి రామకృష్ణ, పిఆర్‌టియు గౌరవ అధ్యక్షులు పప్పల రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర కౌన్సిలర్ బొడ్డేపల్లి గోపీచంద్, వడ్డాది గోపీకృష్ణ, కంచరాపు రామకృష్ణ, బొడ్డేపల్లి గోపి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలతో విద్యార్థులు


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, వైద్య సిబ్బంది

కేన్సర్‌పై అవగాహన

సోంపేట : గ్రామీణ వైద్యులకు సోంపేట పట్టణంలో కేన్సర్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. విశాఖపట్నానికి చెందిన డయాగ్నస్టిక్ ఎస్‌సిజి ఆస్పత్రి వైద్యులు కేన్సర్ వ్యాధి వ్యాప్తి... చికిత్సలపై అవగాహన కల్పించారు. ముందస్తుగా కేన్సర్ ఏవిధంగా గుర్తించాలో తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ సభ్యులు షణ్ముఖరావు, వైద్యులు శ్రీకాంత్, శేషు యాదవ్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు చేపడుతున్నామని టిడిపి మండల యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మెళియాపుట్టి పంచాయతీలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ ఆనాడే బీజం వేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో, అన్న ఆశయ సాధనకు సిఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని తెలిపారు. గతంలో రూ.రెండు లక్షలు ఉన్న బీమా... ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచారని వివరించారు. పార్టీ సభ్యత్వం ద్వారా ఆర్థిక భరోసాకు, భవిష్యత్ భరోసా నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా ఎన్నో ఆర్థిక, విద్యా, ఆరోగ్య భరోసా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బసవ భాస్కరరావు, భీమారావు పాల్గొన్నారు.

వింత పోకడలతో ప్రభుత్వ విద్యకు నష్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యాశాఖ అవలంభిస్తున్న వింత పోకడలతో ప్రభుత్వ విద్యావ్యస్థకు తీరని నష్టం జరుగుతోందని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నరంలోని ప్రైవేటు అతిథి గృహంలో సంఘం ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షులు పూజారి హరి ప్రసన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఇంతవరకు ఆంగ్ల మాధ్యమంలో బోదన జరిగిందని, పరీక్షలు ఏ మాధ్యమంలోనైనా రాసుకోవచ్చని ఆదేశాలివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ఫార్మేటివ్ అస్సెస్మెంట్ పరీక్షలను సెల్ఫ్ అస్సెస్మెంట్ పరీక్షలుగా పేరు మార్చి ప్రాజెక్ట్, అసైన్మెంట్, రాతకు వేర్వేరుగా మార్కులను కేటాయించడం తగదన్నారు. గతంలో రాతపరీక్షలు నిర్వహించి 50 మార్కులు ఆన్‌లైన్‌లోను స్కూల్ రికార్డుల్లోను నమోదు చేయించిన అధికారులు మార్చాలని సూచించడం తగదన్నారు. ఈ నెల 7న జరగనున్న పేరెంట్సు సమావేశంలో 30 మార్కులతో ప్రోగ్రస్ కార్డులు సిద్ధం చేయాలని చెబుతున్నారన్నారు. ఇటువంటి అనాలోచిత,


మాట్లాడుతున్న కృష్ణారావు

అసంబద్ధ నిర్ణయాలతో ఉపాధ్యాయులకు పనిభారం తప్ప ఒరిగేదేమి లేదన్నారు. అపార్ కార్డుల జారీలోను, రెసిడెన్సియల్ ట్రైనింగ్‌ల్లోనూ అసంబద్ధ విధానాలు అవలంభించిన విద్యాశాఖ అధికారుల తీరు అభ్యంతరకరమన్నారు. ఇటువంటి నిర్ణయాల వల్ల విద్యాబోధన సాగక ఇబ్బందులు ఎదురవు తున్నాయన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ రఘురామ స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.వి.ప్రసాద్, బి.రమణమూర్తి, ఎం.గణేష్, వై. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కోలాటం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తిరుపతి తిరుచెనూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో మండలంలోని టి.బరంపురానికి చెందిన జానపద కళాకారుడు తిప్పన ధనంజయరెడ్డి కోలాట శిష్య బృందం, హరిపురం అసరమ్మతల్లి కోలాట బృందం ఆదివారం కోలాటం నిర్వహించారు. ఈ కోలాటం అందరినీ ఆకట్టుకుంది. హంస వాహనంపై ఊరేగించిన అమ్మవారి ప్రాంగణంలో తిరువీధి కార్యక్రమంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మరలా సాయంత్రం 7 నుంచి 10 గంటల వరకు అత్యాద్భుత ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో లోపింటి శంకర్, గేదెల పరుశురాం, చిల్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిని సందర్శించిన 'వేపాడ'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ ఇఒ


చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ భద్రాజీ

యర్రంశెట్టి భద్రాజీ శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.


మొక్కను అందజేస్తున్న డిఎస్‌పి అప్పారావు

ఎమ్మెల్యేను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడాలని డిఎస్‌పికి ఎమ్మెల్యే సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఒ రమణారావు

రేపట్నుంచి సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 3 నుంచి ఉపాధిహామీ ద్వారా 2023–24 ఏడాదిలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధంగా ఉండాలని ఎపిఒ రమణారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు, మస్టర్లు, డిఆర్‌పిలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రూ.23 కోట్లతో పనులు నిర్వహించామని అన్నారు. అందులో రూ.2 కోట్లు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి మెటీరియల్ పనులు, రూ.21 కోట్లు కూలీలకు పనులు కల్పించడం ద్వారా ఖర్చు చేశామని తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో 8 మంది డిఆర్‌పిలు, ఒక ఎస్ఆర్‌పి పాల్గొని 15 రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు.


రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి- టెక్కలి

పంచాయతీలోని ప్రధానమైన మార్గాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ... ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొద్ది రోజుల నుంచి కుక్కల గుంపులుగా సంచరించడంతో ప్రజలు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కుక్కలు సంతానోత్పత్తి చేసుకుంటున్న క్రమంలో వాటి పిల్లలు కూడా రోడ్లపై సంచరిస్తున్నాయి. కుక్కల గుంపును చూసి ప్రజలు, వాహనదారులు హడలిపోతున్నారు. పంచాయతీ సిబ్బంది కొద్ది రోజుల క్రితం పట్టుకుని దూరంగా తరలించారు. మళ్లీ అవి పట్టణానికి చేరుకుని స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైన పంచాయతీ అధికారులు కుక్కల నిర్మూలినకు సరైన నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

పలాస : మండలంలోని రామ కృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో చదువుతున్న విద్యార్థులు కాశీబుగ్గ-పలాస ప్రాంతాల్లో ఆదివారం యాచ కులకు ఆదివారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. విద్యార్థులు తనకు తల్లిదండ్రులు ఖర్చు కోసం ఇచ్చిన డబ్బులను కొంత దాటుకుంటూ ప్రతినెలా యాచికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు.


ఆహార పొట్లాలను అందజేస్తున్న విద్యార్థులు